టెన్త్ పరీక్షలకు సన్నద్ధం

- ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభం
- గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి హాజరుకానున్న 1002 మంది విద్యార్థులు
- 75 రోజుల ప్రత్యేక ప్రణాళికతో ఉపాధ్యాయుల విద్యాబోధన


పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థినులు

బుట్టాయగూడెం(పోలవరం) : ఏప్రిల్ 3వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు, పాఠశాలల యాజమాన్యాల సిబ్బంది నిమగ్నమైయ్యారు. డిసెంబర్ నెలాఖరుకు పాఠ్యాంశాలు పూర్తి చేసుకున్న తర్వాత జనవరి నుంచి 75 రోజుల ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం అవుతున్నారు. గిరిజన సంక్షేమ శాఖ(ఐటీడీఏ) పరిధిలోని 25 ఆశ్రమ పాఠశాలలో సుమారు 1002 మంది గిరిజన విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఆశ్రమ పాఠశాల నుంచి 802 మంది హాజరవుతుండగా అందులో 343 మంది బాలురు, 459 మంది బాలికలు ఉన్నారని చెప్పారు. అలాగే 200 మంది గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారు. బుట్టాయగూడెం మండలంలో జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 97 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

75 రోజుల ప్రణాళికతో విద్యాబోధన

రానున్న 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఐటీడీఏ అధికారులు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం రెగ్యులర్ తరగతులు కాకుండా ఉదయం, రాత్రి ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా విద్యాబోధన చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహిస్తూ చదువుల్లో వెనుకబడిన వారు కూడా ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తున్నారు. అలాగే విద్యార్థులకు అల్పాహారాన్ని కూడా అందజేస్తున్నారు.

విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ



10వ తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువుల్లో ముందుకు సాగే విధంగా కృషి చేస్తున్నాం. అలాగే విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ తీసుకుంటున్నాం.

–తెల్లం బాబూరావు, ఎంఈఓ, బుట్టాయగుడెం

నూటికి నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం లక్ష్యంగా కృషి చేస్తున్నాం. 75 రోజుల ప్రత్యేక ప్రణాళికతో విద్యాబోధన చేస్తున్నాం. అలాగే విద్యార్థులకు తరగతుల సమయంలో స్నాక్స్, టీ ఇవ్వడంతో పాటు ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– బుద్దుల రాముడు, డీవైఈఓ, కేఆర్‌పురం ఐటీడీఏ, బుట్టాయగూడెం మండలం

ఆలయ ఉత్సవ కమిటీ సమావేశం


ఉత్సవ కమిటీని ఉద్దేశించి మాట్లాడుతున్న పాలకమండలి చైర్మన్

కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదన గోపాల స్వామి ఆలయ ప్రారంభోత్సవ విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు విజయవంతం చేయడానికి సమిష్టిగా కృషి చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపాలకృష్ణ పిలుపు ఇచ్చారు. ఆదివారం మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆహ్వాన కమిటీ, అన్న సమారాధన నిర్వహణ కమిటీ, విరాళాల సేకరణ కమిటీలలో సుమారు 40 మంది సభ్యులకు బాధ్యతలను అప్పగించారు. ఈనెల 27 నుంచి మార్చి 6 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ట్రైలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సర్వేశ్వరరావు


సర్వేశ్వరరావు

ద్వారకాతిరుమల : ఏలూరు జిల్లా ట్రైలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సాధనాల సర్వేశ్వరరావు ఎన్నిక కావడంపై మండల ట్రైలర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. మండలంలోని కోడిగూడెంకు చెందిన ఆయన ప్రస్తుతం మండల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. జంగారెడ్డిగూడెంలో ఆదివారం జరిగిన అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలో సర్వేశ్వరరావును ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. దీనిపై మండల ట్రైలర్స్ అసోసియేషన్ సభ్యులు సర్వేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు ఉత్సవం


రహంతుల్లా మహాత్ముని దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక తంగెళ్ళమూడి రాణి నగర్‌లోని హజరత్ నజీముల్లాషా హాజారీ రహంతుల్లా మహాత్ముని ఉరుసు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉరుసు సందర్భంగా ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం దర్గాకు విద్యుద్దీపాలంకరణ చేసి ఫాతెహా ఖానీ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం దువా ప్రార్థనలు చేశారు. ఈ ఉరుసు కార్యక్రమంలో నగరంలోని హిందూ ముస్లింలు కులమతాలకు అతీతంగా పాల్గొని మహాత్ముని సేవించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో కమిటీ సభ్యులు ఎండీ షౌకత్, ఎండీ నవాజ్, ఎండీ నజీర్, ఇతర మత పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు ఎండీ ఆదిల్, కార్యదర్శి ఎండీ అక్రమ్ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

కళాకారులకు సత్కారం


కళాకారుడిని సత్కరిస్తున్న పద్మావతి తదితరులు

ద్వారకాతిరుమల : మండలంలోని తిమ్మాపురం కృష్ణాలయంలో విఘ్నేశ్వర భక్తిసమాజం వారు పలువురు కళాకారులను ఆదివారం సత్కరించారు. భక్తిసమాజం గురువు బోళ్ల పద్మావతి ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జాగరణ నిర్వహించారు. ఉదయం వారంతా పార్థీవలింగానికి విశేష పూజలు జరిపారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి నాగసుబ్రహ్మణ్యం, పుప్పాల మురళీధరరావు, భజన సమాజమండలి సభ్యులు పాల్గొన్నారు.

సాంబశివరావు జయంతి


సాంబశివరావు జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : ఉపాధ్యాయ ఉద్యమకారుడు ఉసా సాంబశివరావు అని బీసీ నాయకులు ఎంఎస్ సత్యనారాయణ, పీపీఎస్ చంద్రరావు కొనియాడారు. పట్టణంలో ఆదివారం సాంబశివరావు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాలతో ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాల కోసం సాంబశివరావు ఎనలేని పోరాటం చేశారని అన్నారు. చిప్పాడ వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బత్తిన చిన్న, శివాజీ, మద్రి వెంకటేశ్వరరావు, ఎల్ఆర్ కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండలరావుకు ఉత్తమ రైతు అవార్డు


ఉత్తమ రైతు అవార్డు గ్రహీత కాళి కొండలరావు

దెందులూరు: దెందులూరు మండలంలో రామారావుగూడెం గ్రామానికి చెందిన పట్టుపరిశ్రమ సాగు చేసే రైతు కాళి కొండలరావుకు ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యారని ఆ శాఖ దెందులూరు మండల టెక్నికల్ అసిస్టెంట్ టీ.రత్తయ్య తెలిపారు. సేంద్రియ, వ్యవసాయ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో పట్టు పరిశ్రమ నిర్వహిస్తూ అధిక దిగుబడి సాధిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచిన కొండలరావును జిల్లా అధికారులు ఉత్తమ రైతుకుగా ఎంపిక చేశారన్నారు. కొండలరావు ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ద్వారా రెండు ఎకరాల్లో పట్టు పరిశ్రమ నిర్వహిస్తున్నారు.

వినతుల స్వీకరణ


ఎమ్మెల్యే కార్యాలయంలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో అధికారులు తొలి ప్రాధాన్యతనివ్వాలని స్పందన, ఎమ్మెల్యే కార్యాలయం సిఫార్సులు త్వరతిగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధికారులకు సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన విభిన్న ప్రతిభావంతులు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యాలయ సిబ్బందితో సమస్యను నమోదు చేయించిన పరిష్కారానికి సంబంధిత శాఖలకు పంపాలని చెప్పారు. దెందులూరు శివాలయం ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాళ్లూరి నాగరాజు, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

వైభవంగా శోభాయాత్ర

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నగరానికి చెందిన మహదేవ్ జాదవ్ మరాఠీ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ్ అధ్యక్షుడు ఆనందరావ్ జగ్దాలే మాట్లాడుతూ పరాయి పాలకుల నుంచి దేశ ప్రజలను, హిందూ దేవాలయాలను కాపాడి అఖండ హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించి కుల, మత, జాతి వివక్ష చూపకుండా రాజ్య పాలన చేసిన హిందూ రాజు శివాజీ అని కొనియాడారు. తొలుత ఈ శోభాయాత్ర స్థానిక 12 పంపుల సెంటర్ నుంచి బయలుదేరి పవర్ పేట స్టేషన్ మీదుగా ఆర్ఆర్ పేట, విజయవిహార్ సెంటర్, పత్తేబాద నాలుగు గుళ్ల సెంటర్‌కు చేరుకుంది. శోభాయాత్ర సందర్భంగా మరాఠీ సమాజ్ సభ్యులు, వీహెచ్‌పీ సభ్యులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో మరాఠీ సమాజ్ గౌరవ అధ్యక్షుడు ప్రశాంత్ భోస్లే, ఆర్ఎస్ఎస్ కార్యదర్శి రుద్రరాజు చైతన్య, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా వీరేశ్వరస్వామి గ్రామోత్సవం


తాడువాయిలో వీరేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : మహాశివరాత్రి దివ్య కల్యాణ మహోత్సవాల్లో ఆదివారం తాడువాయి శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా ఇళ్ల ముంగిటకు ఊరేగింపుగా వచ్చిన వారిని భక్తులు దర్శించి తరించారు. ఆలయ ప్రధానార్చకులు కాళ్లకూరి రవకుమార శర్మ భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామి వారి కల్యాణం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పాపోలు వెంకటేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి అన్నసమారాధన ప్రారంభవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్రం లక్ష్మణరావు, పల్లా గంగాధరరావు, ఓరుగంటి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు


టి.నరసాపురంలో కాశీ విశ్వేశ్వర స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

బుట్టాయగూడెం : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రెండో రోజు ఆదివారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బుట్టాయగూడెంలోని త్రిపుర సుందరీ సమేత కామేశ్వర స్వామి, కుమ్మరిగట్టు వద్ద ఉన్న ఉమా సహిత ఉమామహేశ్వర స్వామి, రెడ్డిగణపవరంలోని విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కుమ్మరిగట్టు శివాలయం వద్ద శనివారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని సుమారు 5 గంటల పాటు వైభవంగా నిర్వహించారు. అలాగే అన్నసమారాధన నిర్వహించారు. అదేవిధంగా చింతలగూడెం సమీపంలోని శివాలయంలో, బెడదనూరు అటవీప్రాంతంలో కొలువై ఉన్న శివుని ఆలయాల వద్ద శివరాత్రి మహోత్సవాలను నిర్వహించారు.

కాశీ విశ్వేశ్వరుని రథోత్సవం

టి.నరసాపురం : టి.నరసాపురంలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి రథోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. భక్తుల సహకారంతో గత ఏడాది తయారు చేసిన రథంపై స్వామి వారిని ఊరేగించారు. భక్తులు స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. మక్కినవారిగూడెంలో భువనేశ్వరి సమేత చంద్రశేఖర స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కుక్కునూరు : మహాశివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి మండలంలోని ఆలయాలలో శివ, పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయాల వద్ద శాంతిహోమం, అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శివ, పార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను తిలకించారు.


కుమ్మరిగట్టు శివాలయం వద్ద అన్నసమారాధన


కుక్కునూరులో నిర్వహిస్తున్న శాంతి హోమం

26న దెందులూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


దెందులూరులో మాట్లాడుతున్న నిర్వహణ కమిటీ నాయకులు

దెందులూరు: దెందులూరులోని వివేకానంద గురుకుల పాఠశాల (1968 నుంచి1975 వరకు)పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక ధనలక్ష్మి నర్సింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు గారపాటి విశ్వనాథం, మద్దిపాటి జయనేంద్రకుమార్, మరడాని అచ్యుతరావు అన్నారు. ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థి, ప్రస్తుత రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మరో ఇద్దరు ప్రజాప్రతినిధులు, దేశవిదేశాల్లో విద్య, వైద్య, రాజకీయ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన అనేక మంది హాజరవుతారని తెలిపారు. భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలను పూర్వ విద్యాల సమ్మేళనంలో ప్రకటిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బొర్రా పట్టాభి, ప్రభాకరరావు ఉన్నారు.

పుస్తకమే ఉన్నతికి సోపానం


శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: భీమడోలు, పూళ్ల, శాఖా గ్రంథాలయాల్లో చదవడం మా కిష్టం కార్యక్రమం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు సామూహిక పుస్తక పఠనంలో పాల్గొని ఎంపిక చేసుకున్న పుస్తకాలను చదివారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను డాక్టర్ సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి, శ్రీధర విజయకృష్ణ చక్కని ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. తొలుత ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మండే సుధాకర్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉన్నత స్థితికి చేరుకునేందుకు పుస్తక పఠనమే చక్కని సోపానమన్నారు. పలు స్ఫూర్తిదాయక కథలను చిన్నారులకు వివరించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు


కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు భారతం, రామాయణం అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపనలు, హరేరామ సంకీర్తనలు చేశారు. అనంతరం స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం చేసి స్వామి వారి నిత్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ఎల్‌బీసీ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలువగా, శ్రీకృష్ణదేవరాయ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. వీరితో పాటు ఎల్‌బీసీ మెయిన్ క్యాంపస్ విద్యార్థులు తృతీయ స్థానంలో, అశోక్ నగర్ భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. ఈ పోటీలకు అనగాని శ్రీరామచంద్రమూర్తి క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. సాయంత్రం 7 గంటల నుంచి నగరానికి చెందిన అభినయ నృత్యభారతి సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచార్య దువ్వి హేమ సుందర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

146 మందికి కంటి పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రామకోటి ప్రాంగణంలోని ప్రార్థనా గాన సంఘ భవనంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాలకు చెందిన వైద్యులు, ఉషా గ్రూప్ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 146 మంది పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 17 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి, వారి శస్త్ర చికిత్సకు ఏర్పాటు చేశారు. మరో 33 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారం హనుమంతరావు, వేమా హరినారాయణ, వేమా రామచంద్రరావు, పసుమర్తి రమేష్, చెన్న వెంకట రామయ్య పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న రైతుల సమస్యలపై చలో ఢిల్లీ


పూళ్లలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

భీమడోలు: రైతుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. పూళ్లలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం మండల రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో లక్షలాది మంది రైతులతో కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. రైతు ఉద్యమంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోదీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, రైతు సంఘం నాయకులు వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, జి.కృష్ణబాలాజీ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం


ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గండికోట శ్రీనును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: కురెళ్లగూడెం గ్రామానికి చెందిన మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. జాతీయ రహదారి పూళ్ల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురెళ్లగూడెంకు చెందిన కూలీలు దంద్రు వీరాస్వామి, కర్నాటి మహేంద్ర, ఊటుకూరి ఫణీంద్ర మృతి చెందిన విషయం విదితమే. తీవ్ర గాయాలతో గండికోట శ్రీను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మూడు మృతదేహాలను ఆయన పరిశీలించారు. మృత దేహాలకు వెంటనే పోస్ట్‌మార్టమ్ చేసి కుటుంబ సభ్యులు అప్పగించాలని సంబంధిత ఆసుపత్రి సూపరిండెంటెంట్‌తో ఎమ్మెల్యే వాసుబాబు ఫోన్‌లో మాట్లాడి ఆ కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయించారు. మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గండికోట శ్రీనును పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన వైఎస్సార్ బీమా నగదు త్వరితగతిన అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రయత్నం చేస్తానని వివరించారు. రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను చీకట్లోకి నెట్టేస్తున్నారని, ఎంత జాగ్రత్తగా ప్రయాణిస్తున్నా ప్రమాదాలు జరగడం చాలా బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు. అనంతరం మృతదేహాలను కురెళ్లగూడెంకు తరలించగా అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతులు ముగ్గురు నిత్యం కూలి పనులకు వెళ్లే తరుణంలో అప్యాయతానురాగాలతో ఉండే వారని, వారిని రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసారు. కర్నాటి మహేంద్ర, ఊటుకూరి ఫణీంద్ర, వీరాస్వామి వారి కుటుంబ సభ్యులు గుండెవిసేలా రోధించారు. ఈ కార్యక్రమాల్లో సీఐ వి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ షంషూద్దీన్, సర్పంచ్ గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు, పెద్దలు రావిపాటి గాంధీ, గన్ని గోపాలరావు, నీలపాల గంగాధరరావు, కె.గోపాలస్వామి, పి.అయ్యప్ప, వీఆర్వోలు ఇంతియాప్, మార్కేండేయులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దాసోహమంటున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు సీహెచ్ రామారావు

ఏలూరు (టూటౌన్) : బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు అప్పగించి వారికి దాసోహమంటోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు చలసాని రామారావు ఆరోపించారు. స్థానిక స్ఫూర్తి భవన్లో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం కె.కృష్ణమాచార్యులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామారావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 8 ఏళ్లుగా కార్మిక హక్కులను హరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశ అభివృద్ధిని కుంటు పరుస్తోందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సమావేశంలో కేంద్రం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి పోరాట కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో పట్టణ మండల జిల్లా మహాసభలు జరపటానికి కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈసమావేశంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కన్వీనింగ్ కమిటీ సభ్యులు డి.లక్ష్మణమూర్తి, భజంత్రీ శ్రీనివాస్, చాట్ల పుల్లారావు, తొర్లపాటి బాబు, పుప్పాల కన్నబాబు, ఐతా సురేష్ పాల్గొన్నారు.